# ప్రళయ వేళ

"అలా సరదాగా షికారెళదాం రావోయ్"

అంటూ పిలిచిందో పిల్లగాలి.

ఇప్పుడు షికారేమిటోయ్ ఎండవేళ"

బద్ధకంగా ఆవులించిందో సుడిగాలి.

"అయినా నువ్వు చెప్పినట్లు విననోయ్. నీ ఇష్టం వచ్చినట్లు పరుగులుపెడితే కుదరదు. నే చెప్పినట్టు వింటేనే వస్తా"అన్నది మళ్ళీ కాసేపు ఆలోచించి.

"అంతేలేవోయ్. మీ పెద్దాళ్ళంతా ఇంతే. అస్తమానం చిన్నవాళ్ళు చెప్పిన మాట, వచ్చినట్టు వినితీరాలనే శాసిస్తారు. నువ్వేమో నీ ఇష్టం వచ్చినట్టు చెలరేగిపోవచ్చు. మరి నేనేమో నీ అడుగుజాడల్లో నడవాలా" నిష్ఠూరంగా అన్నది పిల్లగాలి.

"ఏవో అదంతా నాకు తెలియదు. అలా నీ కిష్టమయితేనే పోదాం. లేకపోతే హాయిగా పడుకొంటా. నిద్ద....రొస్తోం....ది" ఆవులించింది సుడిగాలి.

"అబ్బబ్బ ఏం బెదిరిస్తారోయ్. సరే పా....వెళదాం....ఇదిగో నువ్వలా తొందరగా వెళ్ళిపోకు మరీ....నేను అలా చూసుకొంటూ వస్తా" అన్నది పిల్లగాలి.

"ఆరెరే....ఏవిటా నిదానంగా రావడం. ఇక్కడ మనం తొందరగాపోవాలి" హడావిడి పెట్టింది సుడిగాలి.

"ఏవుంది చెప్మా" తొంగి చూచింది పిల్లగాలి.

ఎండ మండిపోతుంటే చెవటలు కార్చుకుంటూ రాళ్ళు బద్దలు చేస్తున్నారు కూలీలు. భగ్గున మండే ఎండలో రెండు కర్రముక్కలుపాతి వాటికి ఉయ్యాలలు కడితే అందులో మగ్గిపోతూ నిద్రపోతున్నారు పసివాళ్ళు. ఎవరి మొకాల్లోనూ చిరునవ్వు జాడలులేవు. ఆనందం నీడలూ లేవు.

"పోనీ కాసేపు నెమ్మదిగా వీళ్ళ మీద నుంచి వెళతావోయ్" సంబరపడింది పిల్లగాలి.

"అబ్బ చెపితే వినిపించుకోవూ? నువ్వు ఎంతసేపు సేద తీర్చినా వాళ్ళకి తెలియదు. అర్థంకాదు. అలా పనిలోనే వుండిపోతారు. కొండంతా లీజుకు తీసుకుని వాళ్ళకి కాంట్రాక్టు ఇస్తాడు కంట్రాక్టరు. ముందే పదీ ఇరవై అప్పులిచ్చేసి, చచ్చినట్టు తనిచ్చే కూలికి పని చేయించుకుంటాడు. వీళ్ళు ఇలా శవాల్లాగా పని చేయాల్సిందే తప్పదు. పద పోదాం ...రమ్మంటుంటే నీక్కాదూ...."

పిల్లగాలి వెనక్కు తిరిగి వస్తూ నడిచింది.

అప్పటికే సుడిగాలి రివ్వుమంటూ వెళ్ళిపోతోంది కళ్ళు మూసుకుని.

పిల్లగాలి నొచ్చుకుంది "పోనీ ఇక్కడైనా కాసేపు ఆగచ్చు కదా. పాపం ఎంతమంది కార్మికులు, కరెంటుకోతతో ఫ్యాక్టరీ మూసేశారు కాబోలు. పాపం ఫ్యాక్టరీ తెరవండని అరుస్తున్నారు. బుల్లి బుల్లి పిల్లల్ని ఎత్తుకుని ఎంతమంది తల్లులు! ముసలీ, ముతకా నోర్లు తెరుచుకుని ఎండలో మగ్గిపోతూ నిలబడి వున్నారు. వీళ్ళకి పాపం తిండెలాగో ఏమో! ఎంతమంది ఆకలితో చచ్చిపోతారో, బాబోయ్ అన్యాయంగా వుంది...."

పిల్లగాలి కాసేపు దిగాలుగా నిలబడి, అల్లంత దూరాన గబ గబా వెళ్ళిపోతున్న సుడిగాలిని చూచి, నాలుక కరుచుకుని పరుగు తీసింది.

"అబ్బా....ఏవోయ్....పోనీ ఇక్కడ కాసేపు ఆగుదావోయ్" వెంటబడింది పిల్లగాలి.

"ఏం చూస్తావ్....హూ....చూడు....చూసి ఏం చేస్తావ్....పోనీ చూడు.... నాకైతే అలవాటైపోయిందనుకో." సుడిగాలి పెడ మొహం పెట్టి నిలబడింది.

పిల్లగాలి నెమ్మదిగా లోపలకు తొంగి చూచింది. ఆ జైలు కిటికీకి ఉరి పోసుకుని ఎత్తు తక్కువగా వుండడంతో నేల మీదకు కూలినట్లున్న ఇద్దరు ఖైదీలు కనిపించేరు. "అంత తక్కువ ఎత్తున్న కిటికీకి ఎలా ఉరిపోసుకుని చచ్చిపోయారు చెప్మా" అని ఆశ్చర్యపడింది పిల్లగాలి.

"ఇంటరాగేట్ చేస్తుంటే పోయినట్లు రాస్తే ఎలా కుదుర్తుంది సార్? వీళ్ళు ఉరిపోసుకుని చచ్చారు. ఎస్. సర్. కేసంటే-దాని సంగతి నేనేం చెప్పలేనండి. రైతు సంఘం నాయకులు మీటింగు పెట్టుకొంటామని వచ్చారు. వద్దన్నాం సర్. జెండాలు పట్టుకుని ప్రదర్శన చేశారు సర్. వద్దన్నప్పుడు చెయ్యడం వాళ్ళకు అలవాటు సర్. ఏం చేస్తాం సార్. వాళ్ళ దగ్గిర నిషేధించిన సాహిత్యం కట్టలున్నయ్ సర్....ఊ తప్పలేదు సర్. ఒ.కే.సర్. రిపోర్టు సిద్ధంగా వుంది. జైలుకి రావడం ఇది మొదటి సారి వాళ్ళకి. అవమానం భరించలేక ఉరిపోసుకున్నారు సర్. ఒ.కె.సర్. ఒ.కె."

పిల్లగాలికి వణుకు పుట్టింది.

కిటికీకి వేలాడుతున్న శవాలను జాలిగా చూసింది. మొకం, కాళ్ళు, చేతులు గాయాలతో నిండిపోయివున్నాయి. 'అబ్బ ఎంతలా కొట్టారో" పిల్లగాలి తెమ్మెర చనిపోయిన వాళ్ళను జాలిగా స్పృశించింది. రక్తంతో నిండిపోయి, జుత్తంతా మొహానికి అతుక్కుపోయి, పెదాలు బిగించి నిద్రపోతున్నట్లుగా వున్న ఆ కుర్రాడి బుగ్గను జాలిగా తాకింది పిల్లగాలి. ఆ గాలికి వాళ్ళ జుత్తు రెపరెపలాడింది, "పాపం ఎంత ఓర్చుకున్నారో...."

"ఇక రావా....?" కేకేసింది సుడిగాలి.

అయ్యొయ్యో. తొందరగా రా....నువు రావాలి. ఇంక ఇటు వేపు....అబ్బ రావోయ్" అంటూ గోల పెట్టింది సుడిగాలి.

"ఏవయిందీ....ఇప్పుడు నాతో అంత పనేవిటి?" నీరసంగా నడుస్తూవస్తోంది చిరుగాలి.

"హమ్మో ఎంత పని జరిగిందే, అయ్యొయ్యో ఎంతఘోరంచేశారు. అదుగో వాళ్ళే కారెక్కి పోతున్నారు ఒకళ్ళా ఇద్దరా....ఆరుగురు ఈ బంగళాలో మకాం వేశారు కాబోలు. పాపం....పిల్లను చూడు అయ్యో....చచ్చిపోయిందేమో...."

సుడిగాలి రెచ్చిపోయి రివ్వున పైకి లేచింది. కొమ్మలు, రెమ్మలు ఆ ఊపుకి గజగజమన్నాయి.

తాటి తోపులో నిశ్చలంగా పడి వున్న ఆ చిన్నమ్మాయి చుట్టూ కంగారుపడిపోయి గిరికీలు తిరుగుతోంది చిరుగాలి.

"చిన్నది పాపం. పదిహేను దాటి వుంటాయా! ఈ వేళప్పుడు గొడ్లు తోలుకొని వచ్చిందేమో....అంతా పిట్టపురుగు లేదు. ఎవరుంటారు ఈ ఎండ వేళన. ఆ మారాజు బిడ్డలు అమాయకంగా కనపడ్డ ఆ పిల్లను నోరునొక్కి అల్లరిచేసివుంటారు. అంతమంది ఎద్దుల్లా వున్నారు. పసిబిడ్డ ఏం ఓర్చుకొంటుంది? అదీ వంటిమీద తెలివి లేకుండాపడిపోతే. వాళ్ళు ఉడాయించారు.

సుడిగాలి రంకెలు పెడుతోంది. రివ్వున తిరుగుతోంది.

"అయ్యయొ పిల్లది చచ్చిపోతుంది. రక్తాల మయమయిపోయింది. మూలుగు కూడా ఆగిపోయింది. ఏమిటి చెయ్యటం, ఈ పసికూన దిక్కు లేకుండా కళ్ళు మూస్తోందే...."

పిల్లగాలి ఎంత గాలి తెమ్మెరలు వీచినా ఆ పసిది కళ్ళు తెరవలేదు. ఎండలో దిక్కు లేకుండా ఆ తాటితోపుల్లో వెల్లికిలా పడిపోయి వుంది. కిలకిలలాడిపోయి, బిగించి వేసుకున్న జడ ఎగరేస్తూ ఈ చుట్టుపక్కలే గొడ్లతో పాటు పరుగులు తీస్తుండే ఆ పిల్ల మరింక ఎప్పటికీ కిలకిల నవ్వనే నవ్వదు. సంకురాత్రికి గొబ్బిళ్ళు తట్టదు. తిరపతి వెంకన్నకి భక్తిగా దండం పెట్టుకోదు. ఏవీ చేయదు.

పిల్లగాలి నోటమాట రానట్లు నిలబడింది.

ఎక్కడి నుంచో సన్నటి మూలుగు. ఎక్కడో నెమ్మదిగా ఏడుస్తున్నస్వరం. జాలిగా, దీనంగా, దెబ్బతిన్న జంతువులాగా.... "ఎవరిదీ....ఎవరూ...." చిరుగాలి రివ్వున పైకెగిరింది. సుడిగాలి అప్పుడే విజృంభిస్తోంది.

"ఆగాగు. ఇప్పుడే వచ్చేస్తా అలా వెళ్ళిపోకు మరీ....ఇదిగో ఇక్కడే ఎవరో చీకట్లో ఏడుస్తున్నారు. చూసొస్తా"

చిరుగాలి ఆదుర్దాగా వెతుకుతోంది. "అబ్బ. ఇదిగో.... ఇక్కడే.... ఎవరీ అబ్బాయి. ఈ చీకటి గదిలో....ఇదేవిటీ....ఇంత చీకటి.... ఉక్కిరి బిక్కిరిగా వుందీ"

వళ్ళు వణుకుతుంటే చిరుగాలి చుట్టూ చూసింది.

"అన్నం కావాలమ్మా. నాకన్నం కావాలి. నా కెంతో అన్నం తినాలని పిస్తోంది. తెల్లగా వేడిగా వున్న అన్నం. చాలా అన్నం తినాలని ఆశగా వుందమ్మా. ఆకలిగా .... ఆ....క....లి....గా వుంది....అమ్మా దాహంగా వుంది. ఇదేంటమ్మా ఇంత ఆకలి. పరమాన్నం, గారెలు, బూరెలు ఏదీ వద్దు.... అన్నం తింటానే. వేడి వేడిగా ఊదుకొంటూ తినేస్తా...."

చిరుగాలి బిక్కుబిక్కుమని దిక్కులు చూసింది.

ఆ అబ్బాయి గొంతు క్షీణించి పోతోంది.

చిరుగాలి ఏడ్చేస్తోంది.

"అయ్యో ఇదేవిటిలా ఈ పిల్లాడు అన్నం.... అన్నం.... అని అంతలా కలవరించేస్తాడూ....ఏవైందసలు?" చిరుగాలి పక్కగదిలోంచి తొంగి చూసింది.

"వీడెంత మొండెదవ! ఇవ్వాల్టికి పధ్నాలుగు రోజులు వాడెదురుగుండా కూర్చుని టిఫిన్లూ, అన్నం ఎన్నెన్ని రకాలు తిన్నాం, అడ్ని తిన్నివ్వకుండా ఎన్ని ఫలహారాలు చూపించి ఊరించాం! వింటా ఇరవై లేవు గుంట వెధవకు. ఆకళ్ళ

అమాకీ చెప్పు.... ఆ నక్సలైట్లు ఏడ కొస్తారో చెప్పమని ఒకటే ఇదిగా ఆడిని గంటల తరబడి అడిగినా చెప్పలే. ఆళ్ళతో తిరిగేవోడే....''

"పాపం నిజంగా తెలియదేమో.... కాలేజీలో సదువుకొనేవాడికి అయ్యన్నీ ఏం తెలుస్తాయి?''

"ఓరినీ.... వాడి ఏడుపు జూసి గుండె కరుగుతా వుందా ఏం. ఆ కాలేజీలోనే చూడాలి వాడి విశ్వరూపం. యం. ఎల్. ఏ. పాండురంగ కొడిక్కి పోటీగా నిలబడి గెలిచాడు. ఆయన లక్ష ఖర్చుపెడితే పది ఓట్లు పడ్డాయట. ఈ వెధవకి పూర్తి మెజారిటీ అట. నక్సలైట్లతో సంబంధాలు వున్నాయని రిపోర్టు వచ్చింది. మనమేం చేస్తాం....''

"ఆ యం. ఎల్. ఏ. కొడుకు ఇచ్చిన రిపోర్టు పట్టుకొని....''

"నువ్వు ధర్మ పన్నాలు చెప్పకోయ్.... ఆడే దారికి వస్తాడు.... కొన్ని రిపోర్టులకు ఎంత వేల్యూ ఇవ్వాలో అంత వేల్యూ ఇచ్చితీరాలి.''

వెకవెకమని వికారపు నవ్వు.

పిల్లగాలి పరుగెత్తుకొచ్చి గదిలో పడింది. ఆ అబ్బాయి వెల్లకిలా పడిపోయి వున్నాడు. చుట్టూ కాయితాలు చిందర వందరగా ఎగురుతున్నాయి.

"అమ్మా నాకు అన్నం తినాలని వుందే.... అన్నం....''

పిల్లగాలి వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టింది. సుడిగాలి రేగిపోతోంది. ఎర్రని మంట మండిపోతుంటే రివ్వుమని దుమ్ములేపుతూ సుడిగాలి,

"ఇకరా. వెళ్ళిపోదాం షికారొద్దు....'' పిల్లగాలి మాటవినే స్థితిలో లేదు సుడిగాలి.

"బాలరాజు పడిపోయిందయ్యా.... ఆడికి నడుం ఇరిగిపోయిందయ్యా. తొందరగా రండయ్యా. ఆడు కొట్టుకొంటున్నాడండయ్యా.... పిల్లలున్నారయ్యా... సిన్న పిల్లలయ్యా ఆడికి. పెళ్ళాం కనే పొద్దులండయ్యా....''

ఎ.సి. రూములో పంకా కింద ఆపసోపాలు పడుతున్న భారీ కాయం కదిలి ఫోన్ అందుకొంది.

"నరుకు ఇన్సూర్ చేసిందేనా?''

"అయ్యా చేసిందే. పాపం బాలరాజు నడుం విరిగి పోయిందండీ. వాడి బయటేయించాలి. ఆ లారి ముసలెద్దులాగుంది. దాన్ని షెడ్డుకు పంపాలని అపి వుంచాం. తమరు ఆ లారీని తీసుకుపొమ్మన్నారు. ఆ రోడ్డు అసలే అధ్వాన్నం. యాక్సిల్ విరిగిపోయింది. కాలువలో సరుకుతో సహా పడిపోయింది. ఓవర్ లోడ్ జేయిస్తిరి.''

"పోనీయవయ్యా. ఆ సరుకు ఆ బురదగుంటలోపడి మనల్ని వడ్డునేసింది. ఇన్సూరెన్స్ వాళ్ళు వచ్చేదాకా దాన్ని కదిలించకండి. ఇది జరక్కపోతే గొప్పగా నష్టపడేవాళ్ళం...."

"బాలరాజు ఇరుక్కుపోయాడండీ, వాడు కొనఊపిరితో కొట్టుకుంటున్నాడు."

"నువ్వు అన్నీ సర్దుకొని .... షాపు కట్టేసి.... రిపోర్టిచ్చి, వాణ్ణి పైకి లాగండి.... ఇదిగో పంతులూ సరుకు లెక్క సరిజూడు...."

"అప్పటిదాకా వాడు బతికుంటాడటండీ"

సమాధానంగా ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

ఆ బంగళా అంతా చల్లగా వుంది. బయట బాలరాజు అరుపులు, కేకలు, వాళ్ళ బరువులు, బాధలు ఇవన్నీ లోపలికి జొరబడకుండా బందోబస్తుగా వుంది.

బయట ఎండ. రేగిపోయే సుడిగాలి.

యాక్సిడెంటయిన బండిలో ఇరుక్కుపోయి కాళ్ళు ఇంజన్‌లో ఉండిపోయి, తెగిపోయి, నడుం దెబ్బతిని, అటు ప్రాణంపోక, కనీసం వంటిమీద తెలివికూడా పోక అల్లాడిపోతున్నాడు బాలరాజు. మూసుకుపోతున్న కళ్ళకు, పురిటి పొద్దుల పెళ్ళాం, ఇద్దరు పసిపిల్లలు, ఓపికున్నన్నాళ్ళూ చాకిరి చేసి చేసి అరిగి మూలపడ్డ తండ్రీ వరసగా కనబడుతున్నారు. శిథిలం అయిన శరీరంలోంచి ప్రాణం వుండలేనని పెనుగులాడుతోంది!

"నేనుపోతే నా బిడ్డలు అడుక్కుంటారు. అనాథలయిపోతారు. ఆకలి వాళ్ళను ఎటు ఈడ్చుకుపోతుందో.... ఆ పొట్టలు నింపుకోవడం కోసం వాళ్ళు ముష్టి వాళ్ళు, దొంగలు, కిరాతకులూ అయిపోతారేమో. దేవుడా నన్ను బతికించు. నేను బతకాలి. అయ్యో నేను చచ్చిపోను...." గిజగిజ కొట్టుకుంటున్నాడు బాలరాజు. పిల్లగాలి ఏడుస్తూ వణికిపోతూ అతని చుట్టూ పరుగులు పెడుతోంది. చల్లగాలి వస్తే అతనికి కాస్త హాయిగా వుంటుందేమో, పాపం బతుకుతాడేమో. వాళ్ళ పాపాయిని ఎత్తుకుంటాడేమో. పురిటి పొద్దుల పెళ్ళాంతో ఇదిగో నే బతికేవున్నా ఎందుకే ఏడుస్తావు. పిచ్చిదానా అంటాడేమో....అయ్యో ఏం చెయ్యను" పిల్లగాలి నిస్సహాయంగా అతన్ని చుట్టుకొంది. చుట్టూ ప్రళయం. ప్రపంచాన్ని ముంచేయాలన్నంత కోపంతో సుడిగాలి రెచ్చిపోతోంది. మండే ఎండకి తోడు ముంచిపడే సుడిగాలి.... కసిగా, నిస్సహాయంగా, దుఃఖంగా....

"అబ్బ ఇదేం ఎండలు బాబూ, ఇప్పుడే ఇంతలా మండిపోతున్నాయి. అప్పుడే ఈ గాలేమిటి? కాలం కాని కాలంలోనూ ఇలా అయితే ఇక బతికినట్టే...."

ఊరూ వాడా ఉడికిపోతోంది. (వనితాజ్యోతి) *